# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు.
2. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కె జి, యూకెజి వంటి పూర్వ ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టనున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.
3. జల జీవన్ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.
4. ఆంధ్రప్రదేశ్‌లోని నగరపాలక, పురపాలక సంస్థల్లో పన్నులను వసూలు చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించామని మంత్రి పి నారాయణ తెలిపారు.
5. తెలంగాణలో ప్రతి ఇంటికీ టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు.

==========================

ఏలూరు జిల్లా నూజివీడు ఆగిరిపల్లిలో నిర్వహించే మహాత్మ, జ్యోతిరావు పూలే రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు. ఇందుకు సంబందించించిన అన్నిఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా నాయీబ్రాహ్మణులు, గొర్రెల కాపరులు, రజకులు వంటి కుల వృత్తుల వారితో పని స్థలాలకు వెళ్లి, వారి సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రజల ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు.

--------------------------

కాగా... భారత సామాజిక విప్లవ ఉద్యమ వైతాళికులు, ప్రముఖ సంఘసంస్కర్త మహాత్మా జ్యోతీరావ్ పూలే జయంతిని ఈరోజు జరుపుకుంటున్నాం. 1827 ఏప్రిల్ 11వ తేదీన మహారాష్ట్రలోని పూణేజిల్లా ఖానవలిలో జన్మించారు. సమాజంలో వెనుకబడిన వర్గ ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాడి, సాధికారతకు జ్యోతీరావ్ పూలే కృషి చేశారు. తన జీవితాన్ని బలహీన వర్గాల సంక్షేమానికి అంకితం చేసిన పూలే, 1890 నవంబర్ 28న పూణేలో మరణించారు. నవసమాజ స్థాపనకు ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ రోజు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

--------------------------

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కె జి, యూకెజి వంటి పూర్వ ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టనున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీసు పాఠశాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహాత్మాగాంధీ స్ఫూర్తితోనే యంగ్ ఇండియా సమీకృత పాఠశాలల్ని ప్రారంభించామని చెప్పారు. విద్య, ఉద్యోగావకాశాలు కల్పించడమే వీటి లక్ష్యమని చెప్పారు. ఈ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం 11 వేల 5 వందల కోట్ల రుపాయలను కేటాయించామని ముఖ్యమంత్రి వివరిస్తూ,..

వాయిస్.. 29 సెకన్లు

---------------------------

జల జీవన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజల కోసం ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ లను కేంద్ర మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్టాండ్ లో ప్రయాణికులకు, కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు దాహార్తి సమస్య లేకుండా ఈ వాటర్ ప్లాంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

---------------------------

ప్రాచీన, భౌగోళిక, చారిత్రక వారసత్వానికి చిహ్నంగా నిలిచిన గండికోటను ప్రపంచ పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు అవకాశముందని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.ఎల్.కాంతారావు తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా గండికోటను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం 'ఆంధ్రప్రదేశ్‌లో భౌగోళిక కార్యకలాపాలు' అనే అంశంపై ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రాండ్ కాన్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన గండికోట లోయకు ఐక్య రాజ్య సమితి విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ –యునెస్కో గుర్తింపు కోసం ఇక్కడి వనరులు, భౌగోళిక స్థితిగతులు, సాంస్కృతిక పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వనున్నామని చెప్పారు.

---------------------------

నగరపాలక, పురపాలక సంస్థల్లో పన్నులను వసూలు చేసేందుకు నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. పట్టణాలు, నగరాల్లో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై విజయవాడలో నిర్వహించిన కార్యశాలలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, ఉద్యాన వనాల అభివృద్ధి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణాల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇతర రాష్ట్రాల్లోనూ అధ్యయనం చేశామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 24 సెకన్లు

---------------------------

తెలంగాణలో ప్రతి ఇంటికీ టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని ఐటీ

శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్ బేగంపేటలో నూతనంగా ఏర్పాటైన తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, లోకల్ కేబుల్ ఆపరేటర్ల–ఎల్‌సీఓ ద్వారా అందరికీ ఇంటర్నెట్‌తో పాటు స్మార్ట్ సేవలను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వైయస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టశ్రీ కోదండ రామాలయంలో ఈరోజు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాలవరకు ఈ కళ్యాణ మహోత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీతారాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.

మరోవైపు నిన్న ఒంటిమిట్టలో కళ్యాణోత్సవ ఏర్పాట్లపై తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ, కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద 60 వేల మంది కూర్చుని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రతి గ్యాలరీలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా చర్యలు చేపట్టామని ఆయన తెలియజేస్తూ..

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అనంతపురంలో 8కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన మద్యం డిపో, జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణా అరికట్టడంతో సరిహద్దు జిల్లాల్లో అక్రమ రవాణా తగ్గిందని చెప్పారు.

వాయిస్ .. 30 సెకన్లు

======================